# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి

- మ్యాపింగ్ కాని, వ్యత్యాసాలున్న ఓటర్లపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయం నుంచి సమావేశంలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్ల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. ఫారాల పంపిణీ, సేకరణ అనంతరం మ్యాపింగ్ కాని, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించాలని, అక్టోబర్ 15లోగా నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేసి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. నోటీసుల జారీ నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం వరకు ప్రతి దశను సమన్వయంతో పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 61,886 మంది ఓటర్లు మ్యాపింగ్ కాలేదని, మరో 2,08,308 మంది ఓటర్లు అనామలీస్ కింద ఉన్నారని పేర్కొన్నారు. వీరందరికీ నిబంధనల ప్రకారం నోటీసులు అందజేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత ఎన్నికల అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి



**శెనార్తి మీడియా, గన్నేరువరం::**

భూ భారతి రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గన్నేరువరం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో రెవిన్యూ అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ప్రతి భూ సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. మండల రెవిన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించలేదని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆరోపించారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి మండలంలోని భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు సూచనలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాక రైతులు రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే గుండ్లపల్లి నుంచి పోతూరు వరకు యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని నాయకులు ప్రకటించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాంతాల అంజిరెడ్డి, మండల కార్యదర్శి చొక్కల శ్రీశైలం, సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, బొమ్మకంట అంజయ్యచారి, పిప్పల కనకయ్య, మాదాపూర్ గ్రామ సహాయ కార్యదర్శి లింగం గణేష్, మండల నాయకులు ఎండీ నయీమ్, న్యాత కొమురయ్య, కిష్టయ్య, దామా సంపత్, కొరివి చంద్రయ్య, కొరివి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## శిశుగృహ బాబు దత్తత అందజేత



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ శిశుగృహలోని నాలుగు నెలల బాబును కర్ణాటకకు చెందిన దంపతులకు జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ఆధ్వర్యంలో గురువారం చట్టబద్ధంగా దత్తత అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన పద్ధతిలోనే పిల్లలను దత్తత తీసుకోవాలని సూచించారు. దత్తత తీసుకోవాలనుకునేవారు పూర్తి సమాచారం కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, జిల్లా పరిషత్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ పర్వీన్, శిశుగృహ ఇన్‌చార్జి అపూర్వ, జె.తిరుపతి, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, మునిగంటి రాజ్‌కుమార్, సాదినేని రమేష్, అనూష, రమేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

- పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం: ఏబీవీపీ




**జగిత్యాల, ఆగస్టు 19:**

కోరుట్ల పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రతికూలంగా ఉన్న జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏబీవీపీ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మడవేణి సునీల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97 విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



## "పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెల్లో ప్రజా పాలన"

- 173 గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**శెనార్తి మీడియా, సైదాపూర్:**



ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన "పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెల్లో ప్రజా పాలన" కార్యక్రమం గురువారం సైదాపూర్ మండలంలో ప్రారంభమైంది. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో పర్యటించే ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు దుద్దెనపల్లి, ఎక్లాస్‌పూర్, సోమారం, గర్రెపల్లి, లస్మన్నపల్లి, వెన్నెంపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ప్రతి గ్రామంలో ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో మంత్రి ముఖాముఖి నిర్వహించి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు, వ్యవసాయ సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను ప్రజల ముందుకు తీసుకువచ్చి సాధ్యమైన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టారు. మిగిలిన సమస్యలకు గడువు నిర్ణయించి పర్యవేక్షించాలని సూచించారు. దుద్దెనపల్లి, ఎక్లాస్‌పూర్, వెన్నెంపల్లిలో రూ.20 లక్షల చొప్పున నిర్మించిన పల్లె దవాఖానలను ప్రారంభించారు. దుద్దెనపల్లి–మొగిలిపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3.56 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వెన్నెంపల్లిలో 21 ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని, రెండో విడత త్వరలో మంజూరు చేస్తామని చెప్పారు. 35 మహిళా సంఘాలకు రూ.13.5 లక్షల వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ కింద రూ.4.35 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. గ్రామంలో రూ.7.13 కోట్ల రైతు రుణమాఫీ జరగగా, 213 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ అందిందన్నారు. ఆరేపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించిన గ్రామ మహిళా సంఘం భవనం, ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. లస్మన్నపల్లిలో ప్రభుత్వ పథకాలు అందని అర్హుల వివరాలను అధికారులు నమోదు చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సోమారం, గర్రెపల్లిలో ప్రజా సమస్యలను మంత్రి స్వయంగా తెలుసుకున్నారు. ఈనెల 31 వరకు ఏడు రకాల పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, జలసిరి ద్వారా ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ ఇంజెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. వరితో పాటు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని చెప్పారు. 200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు పూర్తి చేసిన గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షల అభివృద్ధి నిధులు అందిస్తామని ప్రకటించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, బోదకాలు, తలసేమియా బాధిత అర్హులకు పింఛన్లు అందేలా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు, సాగునీటి కాలువలకు భూసేకరణ, ఎల్ఎండీ నుంచి నీటి ప్రాజెక్టు, ఎంఎంఆర్ కింద పెండింగ్ పనులను రాష్ట్రస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వినడం, నమోదు చేయడం, సంబంధిత అధికారిని గుర్తించడం, పరిష్కారానికి గడువు నిర్ణయించడం, అనంతరం సమీక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు.

## ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవం



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గన్నేరువరం మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫోటోగ్రఫీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లను శాలువాలతో సన్మానించారు. ఫోటోగ్రఫీ రంగంలో సీనియర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుకొండ దత్తాద్రి, గన్నేరువరం మండల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఇనుకొండ లక్ష్మణ్, కోశాధికారి వేముల రాములు, సీనియర్ ఫోటోగ్రాఫర్లు బూర తిరుపతి, మఠం ఆంజనేయులు, మఠం తిరుపతి, బూర శ్రీకాంత్, కాలువ నాగరాజు, గర్శకుర్తి శశి తదితరులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల బోనస్‌కు నమోదు తప్పనిసరి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 7 రకాల సన్న వరి సాగు చేస్తున్న రైతులు రూ. 500 బోనస్ పొందేందుకు తప్పనిసరిగా తమ సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ శంకరపట్నం మండల రైతులకు సూచించింది. ప్రైవేట్ డీలర్లు లేదా సొసైటీల వద్ద విత్తనం కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ లేదా సొసైటీ నిర్వాహకుల ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. స్వంత విత్తనం, సీడ్ ప్లాంట్, యూనివర్సిటీ లేదా పరిశోధనా స్థానాల నుంచి విత్తనం పొందిన రైతులు సంబంధిత ఏఈవోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. సాగు వివరాల నమోదుకు చివరి తేదీ సెప్టెంబర్ 10, 2026. ఆన్‌లైన్‌లో సాగు వివరాలు నమోదు చేసుకున్న రైతులు మాత్రమే సన్న వడ్ల బోనస్‌కు అర్హులవుతారని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది



# భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

**జగిత్యాల, ఆగస్టు 19:**



జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో హనుమాన్ దేవాలయంలో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్, రాధిక దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, రాజేశం గౌడ్ కూడా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు
ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పవిత్రమైన హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులకు అభినందనలు తెలిపారు. హనుమంతుడు భక్తి, ధైర్యం, సేవాభావం, నిస్వార్థ త్యాగానికి ప్రతీక అని అన్నారు. శ్రీరాముడిపై ఆయన చూపిన అచంచలమైన భక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. నేటి యువత హనుమంతుడి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. ఆలయాలు కేవలం పూజలు నిర్వహించే ప్రదేశాలు మాత్రమే కాదని, సమాజంలో ఐకమత్యం, సాంస్కృతిక విలువలను పెంపొందించే కేంద్రాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, రాజేశం గౌడ్, గ్రామ, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీలంకపై టీమిండియా ఘన విజయం

**స్పోర్ట్స్ డెస్క్:**



శ్రీలంకతో గాలె వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. శ్రీలంకను రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే ఆలౌట్ చేసిన భారత్.. 165 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 202527 పాయింట్ల పట్టికలో టీమిండియా తన స్థానాన్ని మెరుగుపరుచుకుంది. ప్రస్తుతం భారత్ 10 టెస్టుల్లో 5 విజయాలు, 4 ఓటములు, ఒక డ్రాను చేసుకుంది. 64 పాయింట్లు, 53.33 పర్సంటేజ్ పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతోంది.
శ్రీలంకపై విజయం సాధించినప్పటికీ భారత్ ఐదో స్థానంలోనే కొనసాగుతోంది. అయితే 53.33 శాతం పాయింట్లతో టాప్4కు చేరువైంది. ఆస్ట్రేలియా 77.78 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. దక్షిణాఫ్రికా 75 శాతంతో రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 72.22 శాతంతో మూడో స్థానంలో, బంగ్లాదేశ్ 66.67 శాతంతో నాలుగో స్థానంలో ఉన్నాయి. శ్రీలంక 33.33 శాతం పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. ఇంగ్లండ్ 24.36 శాతం, పాకిస్థాన్ 22.22 శాతం, వెస్టిండీస్ 20.83 శాతం పాయింట్లతో వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. శ్రీలంకపై తొలి టెస్టులో సాధించిన విజయం భారత్‌కు సిరీస్‌లో 10 ఆధిక్యాన్ని అందించడంతో పాటు డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలోనూ కీలకంగా మారింది. టాప్4లోకి చేరాలంటే భారత్ మిగిలిన మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించాల్సి ఉంటుంది.
గాలె టెస్టులో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులు చేసింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ 230 బంతుల్లో 167 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. కేఎల్ రాహుల్ 82 పరుగులు చేయగా.. ధ్రువ్ జురెల్ 51 పరుగులు చేశాడు. రిషభ్ పంత్ 39 పరుగులు చేశాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య నాలుగు వికెట్లు పడగొట్టగా.. కేశర నువంత మూడు వికెట్లు, అసిత ఫెర్నాండో రెండు వికెట్లు తీశారు.
శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 284 పరుగులు చేసింది. సోనల్ దినూష శతకం (100) చేయగా.. నిరోషన్ డిక్వెల్లా 80 పరుగులతో రాణించాడు. శ్రీలంకను 284 పరుగులకే ఆలౌట్ చేసిన భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల ఆధిక్యం సాధించింది. భారత బౌలర్లలో మానవ్ సుతార్ నాలుగు వికెట్లతో అదరగొట్టాడు. రవీంద్ర జడేజా మూడు వికెట్లు పడగొట్టగా.. కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 193 పరుగులు చేసింది. రిషభ్ పంత్ 69 బంతుల్లో 66 పరుగులు బాదాడు. దేవదత్ పడిక్కల్ 44, కేఎల్ రాహుల్ 35 పరుగులు చేశారు. దీంతో శ్రీలంక ముందు భారత్ 372 పరుగుల భారీ విజయ లక్ష్యాన్ని ఉంచింది. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో నాలుగు వికెట్లు పడగొట్టగా.. ప్రభాత్ జయసూర్య మూడు వికెట్లు తీశాడు.
372 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక.. భారత బౌలర్ల ధాటికి 206 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ధనంజయ డి సిల్వ 59 పరుగులతో పోరాడగా.. సోనల్ దినూష 84 పరుగులతో పోరాడే ప్రయత్నం చేశాడు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో శ్రీలంక ఓటమి తప్పలేదు. మానవ్ సుతార్ రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఆరు వికెట్లు తీసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. రవీంద్ర జడేజా, ప్రసిధ్ కృష్ణ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. మహ్మద్ సిరాజ్ ఒక వికెట్ తీశాడు. ఈ మ్యాచ్‌లో సుతార్ 10 వికెట్లతో భారత విజయంలో కీలకంగా నిలిచాడు.



## 10 వికెట్లతో శ్రీలంక నడ్డి విరిచిన భారత యువ బౌలర్..

శ్రీలంకతో జరిగిన గాలే టెస్టులో భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ సంచలన ప్రదర్శనతో మ్యాచ్ విజేతగా నిలిచాడు. టెస్ట్ కెరీర్ ప్రారంభించిన స్వల్ప కాలంలోనే తన వైవిధ్యమైన స్పిన్ బౌలింగ్‌తో అంతర్జాతీయ స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, భారత్ 165 పరుగుల భారీ విజయం సాధించడంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో లంక బ్యాటర్లను కట్టడి చేయడంలో సుతార్ కీలకంగా వ్యవహరించాడు. తన 21.4 ఓవర్ల కోటాలో 76 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజాతో కలిసి పిచ్‌ను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యర్థి బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో సుతార్ మరింత ప్రమాదకరంగా మారాడు. శ్రీలంక బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 23.4 ఓవర్లలో కేవలం 55 పరుగులే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. పిచ్‌పై లభిస్తున్న టర్న్‌ను వాడుకుంటూ వరుసగా వికెట్లు తీసి లంకను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. చివరి వికెట్‌గా కేశర నువంత (20)ను క్విక్కర్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేసి మ్యాచ్‌ను ముగించడంతో పాటు, తన కెరీర్‌లో తొలిసారిగా ఒకే టెస్టులో 10 వికెట్ల మైలురాయిని అందుకొని గాల్లోకి పంచ్ విసురుతూ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. జూన్ 2026లో టెస్టు క్రికెట్ లోకి అడుగుపెట్టిన ఈ యువ స్పిన్ సంచలనం, ఇంత తక్కువ సమయంలోనే జట్టులో తన స్థానాన్ని పటిష్టం చేసుకున్న తీరు అద్భుతం. మ్యాచ్ అనంతరం సోషల్ మీడియా వేదికగా క్రికెట్ అభిమానులు, మాజీ ఆటగాళ్లు, నెటిజన్లు మానవ్ సుతార్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సుతార్ ప్రదర్శించిన క్రమశిక్షణ, లైన్ అండ్ లెంగ్త్ భారత టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకమని కొనియాడుతున్నారు.

## విరాట్ కోహ్లీ నా 'బ్రదర్'..

- **పీవీ సింధు ఆసక్తికర వ్యాఖ్యలు..**

భారత బ్యాడ్మింటన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీతో ఉన్న ప్రత్యేక అనుబంధంపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. విరాట్ కోహ్లీని తాను సొంత సోదరుడిగా భావిస్తానని, కెరీర్‌లోని కష్టకాలంలో ఆయన ఇచ్చిన సలహా తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చివేసిందని వెల్లడించారు. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సింధు, విరాట్‌తో ఉన్న సాన్నిహిత్యం , మైదానంలో ఆయన ప్రదర్శించే పట్టుదలపై ప్రశంసల వర్షం కురిపించారు. కెరీర్‌లో తీవ్ర నిరాశలో ఉన్న సమయంలో ఒకసారి విరాట్ కోహ్లీని కలిసినట్లు సింధు గుర్తుచేసుకున్నారు. ఏదీ కలసిరావడం లేదని తాను చెప్పినప్పుడు, "ఏదీ ఆలోచించకుండా కేవలం మైదానంలోకి అడుగుపెట్టు. నీవు ఏమిటో, నీ కష్టం ఏమిటో నీకు తెలుసు. ఎలాంటి భయం లేకుండా నీ సహజ సిద్ధమైన ఆటను ఆడు. పోయేదేమీ లేదు, నువ్వేంటో ప్రపంచానికి చూపించు" అని విరాట్ ధైర్యం చెప్పినట్లు తెలిపారు. ఆ ఒక్క మాట తనలో సరికొత్త దృక్పథాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పేర్కొన్నారు.
అత్యున్నత స్థాయికి ఎదిగిన క్రీడాకారుడి నుంచి ఇలాంటి ప్రోత్సాహం లభించడం గొప్ప విషయమని, తానేదైనా టోర్నీ గెలిచినప్పుడు ఆ సంతోషాన్ని విరాట్‌తో పంచుకుంటానని సింధు చెప్పారు. ఎంత సాధించినా విరాట్ ప్రదర్శించే క్రమశిక్షణ, నిబద్ధత ఇతరులకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రస్తుతం న్యూఢిల్లీలో జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ (BWF) ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఐదుసార్లు పతక విజేతగా నిలిచిన పీవీ సింధు శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ఐర్లాండ్‌కు చెందిన సోఫియా నోబుల్‌పై 217, 2111 తేడాతో విజయం సాధించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లారు. మైదానంలో నిలకడగా రాణిస్తూనే, విరాట్ లాంటి అగ్రశ్రేణి అథ్లెట్ల అనుభవాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నానని సింధు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### అగార్కర్‌తో విభేదాలు.. గంభీర్‌పై అసంతృప్తి..

## టీమిండియాలో లుకలుకలు?



టీమిండియా సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్‌పై మరోసారి చర్చ మొదలైంది. ఇటీవల ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డేలో సెంచరీ చేసిన తర్వాత రోహిత్ తన రిటైర్మెంట్ ఆలోచనను మార్చుకున్నట్లు ఓ నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో రోహిత్, బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మధ్య విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలను బీసీసీఐ అధికారికంగా ఇప్పటివరకు ధృవీకరించలేదు. ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు రోహిత్ శర్మ వన్డే కెరీర్‌పై బీసీసీఐ సెలెక్టర్లు చర్చించినట్లు సమాచారం. తొలి రెండు మ్యాచ్‌ల తర్వాత తన వన్డే భవిష్యత్‌పై ఆలోచిస్తానని రోహిత్ సెలెక్టర్లకు హామీ ఇచ్చారట. అయితే లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో అద్భుత సెంచరీ సాధించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ ఇన్నింగ్స్ తర్వాత రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పే ఆలోచనను మార్చుకున్నాడట. ఇదే సమయంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో రోహిత్‌కు విభేదాలు తలెత్తినట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా అగార్కర్‌ను చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి తొలగించాలని రోహిత్ కోరినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు వ్యవహారాల్లో ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారనే విషయంలో కూడా రోహిత్ శర్మ తన అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు మరో నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) అధిపతి వీవీఎస్ లక్ష్మణ్‌కు టీమ్ మేనేజ్‌మెంట్‌లో మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించారట. అయితే రోహిత్ వన్డే భవిష్యత్తుకు ఎలాంటి ప్రమాదం లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరగనున్న తదుపరి వన్డే సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం రోహిత్ వన్డే కెరీర్ సజావుగా సాగనుందట. అయితే రోహిత్ వన్డే భవిష్యత్, అగార్కర్‌తో విభేదాలపై వస్తున్న వార్తలకు బీసీసీఐ నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

## వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ప్రీక్వార్టర్స్‌కు సింధు..

- **రెండో రౌండ్‌లో ఓడిన లక్ష్యసేన్**



స్పోర్ట్స్ : ఢిల్లీలో జరుగుతున్న బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. టోర్నీలో ఆమె వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన ఉమెన్స్ సింగిల్స్ రెండో రౌండ్‌లో సింధు 2116, 217 తేడాతో కెనడాకు చెందిన వెన్ యు జాంగ్‌ను ఓడించింది. 35 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సింధుకు ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైంది. తొలి గేములో 88 వరకు ఇద్దరూ పాయింట్ల కోసం పోటీపడ్డారు. కానీ ఆ తర్వాత సింధు దూకుడు పెంచి తొలి గేము నెగ్గింది. ఇక రెండో గేములో ఒకానొక సమయంలో సింధు 912తో వెనుకబడింది. అప్పుడు బలంగా పుంజుకున్న సింధు కెనడా ప్లేయర్ దూకుడుకు కళ్లెం వేసింది. 1515తో స్కోరును సమం చేసి ఆ తర్వాత వరుసగా పాయింట్స్ గెలిచి విజేతగా నిలిచింది. మరోవైపు, యువ ప్లేయర్ ఆయుశ్ శెట్టి సంచలన ప్రదర్శన కొనసాగుతోంది. తొలి రౌండ్‌లోనే వరల్డ్ నం.1 ఆటగాడికి షాకిచ్చిన అతను రెండో రౌండ్‌లోనూ విజయం సాధించాడు. శ్రీలంక ప్లేయర్ దుమిందు అబేవిక్రమతో తలపడిన ఆయుశ్ 218, 2110 తేడాతో విజయం సాధించాడు. కేవలం 26 నిమిషాల్లోనే మ్యాచ్‌ను సొంతం చేసుకుని ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డిచిరాగ్ శెట్టి కూడా ముందంజ వేసింది. రెండో రౌండ్‌లో స్కాట్లాండ్ ప్లేయర్లతో తలపడాల్సి ఉండగా వారు గాయం కారణంగా మ్యాచ్ నుంచి తప్పుకున్నారు. దీంతో సాత్విక్ జోడీ వాకోవర్ ద్వారా ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టోధ్రువ్ కపిల జోడీ 2111, 2111 తేడాతో లియోంగ్ లోక్ చోంగ్‌వెంగ్ చి(మకావు చైనా) ద్వయాన్ని ఓడించి మూడో రౌండ్‌లో అడుగుపెట్టింది.

**లక్ష్యసేన్ ఔట్**

టోర్నీలో భారత్‌కు భారీ షాక్ తగిలింది. స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ రెండో రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అమెరికాకు చెందిన గారెట్ టాన్‌తో తలపడిన సేన్ 2119, 1921, 1721 తేడాతో ఓడిపోయాడు. గంటా 13 నిమిషాలపాటు ఇద్దరు హోరాహోరీగా పోటీపడ్డారు. మొదట తొలి గేము నెగ్గి సేన్ శుభారంభం చేశాడు. కానీ, మిగతా రెండు గేముల్లో మాత్రం ప్రత్యర్థిని నిలువరించలేకపోయాడు. తొలి గేము కోల్పోయిన తర్వాత బలంగా పుంజుకున్న టాన్.. సేన్ దూకుడుకు కళ్లెం వేశాడు. సేన్ పోటీనిచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో పతకం తెస్తాడని భావించిన సేన్ రెండో రౌండ్‌లోనే ఓడిపోవడం భారత అభిమానులకు నిరాశ కలిగించేదే. యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా కూడా ముందంజ వేయలేకపోయింది. రెండో రౌండ్‌లో ఆమె 2111, 921, 2123 తేడాతో కెనడాకు చెందిన మిచెల్లె లీ చేతిలో ఓడిపోయింది.

## డ్రగ్ స్మగ్లర్‌గా మారిన మాజీ రెజ్లర్..

స్పోర్ట్స్ :నల్లమందు స్మగ్లింగ్ కేసులో మూడేళ్లుగా పరారీలో ఉన్న మాజీ జాతీయ స్థాయి రెజ్లర్ అమిత్ షియోరన్‌ను మంగళవారం రాత్రి ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లాకు చెందిన అమిత్ 2013 జాతీయ క్యాడెంట్ రెజ్లింగ్ పోటీలో కాంస్య పతకం గెలిచాడు. హర్యానా, ఢిల్లీలోని రెజ్లింగ్ శిక్షణా కేంద్రాలకు సరఫరా చేయడానికి నల్లమందును సేకరించాడని అతనిపై ఆరోపణలు ఉన్నాయి. 2023 ఏప్రిల్‌లో జార్ఖండ్‌కు చెందిన సరఫరదారు రాజేశ్ నాగ్‌ను జార్ఖండ్ పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో అతను నల్లమందు స్వీకరింప్రధాన వ్యక్తులలో అమిత్ ఒక్కడని తెలిపాడు. దీంతో 2023 డిసెంబర్‌లో కోర్టు అతన్ని నేరస్తుడిగా ప్రకటించగా అప్పటి నుంచి అమిత్ పరారీలో ఉన్నాడు. మంగళవారం రాత్రి తన బంధువును కలవడానికి అమిత్ వస్తున్నాడని ఢిల్లీ పోలీసులకు కచ్చితమైన సమాచారం అందింది. దీంతో వలపన్ని మధుబన్ చౌక్ మెట్రో స్టేషన్ సమీపంలో అతన్ని పట్టుకున్నారు. అతనిపై ఆరు క్రిమినల్ కేసులో ఉన్నట్టు తెలుస్తోంది. ఢిల్లీ పోలీసులు విచారణ నిమిత్తం అతన్ని జార్ఖండ్ పోలీసులకు అప్పగించారు. విచారణలో అమిత్ సంచలన విషయాలు బయటపెట్టాడు. రోహ్‌తక్‌లోని మెహర్ సింగ్ అఖాడాలో, ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో చాలా మంది రెజ్లర్లు తమ పని గంటలు, ట్రైనింగ్ సెషన్స్‌ను పెంచుకోవడానికి నల్లమందు తీసుకోవడం తాను గమనించినట్టు చెప్పాడు. త్వరగా, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అమిత్ డ్రగ్ సప్లయిర్‌గా మారినట్టు పోలీసులు తెలిపారు.

## సీఎస్‌కే కీలక బాధ్యతల్లో ధోనీ

**స్పోర్ట్స్ డెస్క్:**



హస్సీకి కలిసొచ్చే అంశాలెన్నో

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ కొత్త ప్రధాన కోచ్ ఎంపికపై దృష్టి సారించింది. దాదాపు 18 ఏళ్లపాటు జట్టుకు సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇటీవల సీఎస్‌కేతో విడిపోవడంతో.. ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు అన్వేషణ మొదలైంది. ఈ క్రమంలో కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియలో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సీఎస్‌కే భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**విదేశీ కోచ్ వైపే మొగ్గు**

కొత్త ప్రధాన కోచ్‌గా విదేశీ వ్యక్తినే నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రముఖ క్రికెట్ జర్నలిస్ట్ వెంకట కృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. కోచ్ నియామకంపై అధికారిక ప్రకటన అక్టోబర్ తర్వాత వెలువడే అవకాశం ఉంది. విదేశీ కోచ్ ఎంపిక ప్రక్రియను ధోనీ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.
ఫ్లెమింగ్ వారసుడిగా న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేర్లు వినిపిస్తున్నాయి. భారత మాజీలు రాహుల్ ద్రవిడ్, హేమంగ్ బదానీ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే విదేశీ కోచ్ వైపే సీఎస్‌కే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుండటంతో.. భారత మాజీలకు అవకాశం తగ్గినట్లుగా ప్రచారం జరుగుతోంది.
సీఎస్‌కేతో సుదీర్ఘ అనుబంధం ఉన్న ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ మైక్ హస్సీ పేరు కూడా ప్రధాన కోచ్ పదవికి పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఆటగాడిగా సీఎస్‌కే తరఫున సేవలందించిన ఆయన.. ప్రస్తుతం జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా కొనసాగుతున్నారు. సీఎస్‌కే వాతావరణం, జట్టు పనితీరు, ఆటగాళ్లతో ఉన్న అనుబంధంపై హస్సీకి మంచి అవగాహన ఉండటం ఆయనకు అనుకూలంగా మారే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే.. ఐపీఎల్ 2027కు ముందు ఆటగాళ్ల మార్పిడిపై కూడా సీఎస్‌కేకు సంబంధించి పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను జట్టులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారంలోనూ ధోనీ కీలకంగా వ్యవహరించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో కొత్త కోచ్ ఎంపికతో పాటు జట్టు కూర్పులో సీఎస్‌కే ఎలాంటి మార్పులు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఆ ఇద్దరి వల్లే ఈ గెలుపు సాధ్యమైంది!



శ్రీలంకతో గాలె వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత టెస్టు చరిత్రలో 600వ మ్యాచ్‌గా నిలిచిన ఈ టెస్టులో విజయం సాధించడం జట్టుకు ప్రత్యేకంగా మారింది. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లోనూ భారత్‌కు కీలక పాయింట్లు దక్కాయి. మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. 600వ టెస్టులో విజయం సాధించడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతి అని పేర్కొన్నాడు. భారత్‌కు 600వ టెస్టు మ్యాచ్‌లో విజయాన్ని అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపాడు. '600వ టెస్టు మ్యాచ్‌లో విజయాన్ని అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ విజయంను ఎప్పటికీ మర్చిపోలేను. వాతావరణ పరిస్థితుల కారణంగా మ్యాచ్ పూర్తిగా జరుగుతుందా? లేదా? అనే సందేహం ఉన్నప్పటికీ.. ఆటగాళ్లు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొన్నారు. మ్యాచ్‌లో ఒక దశలో టీమిండియా ఆధిపత్యంలో ఉన్నప్పటికీ.. పరిస్థితులు కొంత క్లిష్టంగా మారాయి. అయినా మా ఆటగాళ్లు అద్భుతంగా ఆడారు. రెండో ఇన్నింగ్స్‌లో త్వరగా కొన్ని వికెట్లు కోల్పోయినా ఆందోళన చెందలేదు. 400 పరుగులు చేయాలనే లక్ష్యంతో బ్యాటర్లు దూకుడుగా ఆడాలని నిర్ణయించుకున్నారు. పిచ్‌పై పరుగులు చేయడం అంత సులభంగా లేకపోవడంతో.. వీలైనన్ని ఓవర్లు శ్రీలంకకు బౌలింగ్ చేయాలనే ఉద్దేశంతో భారత్ వేగంగా పరుగులు చేయాలని ప్రయత్నించింది. ఈ క్రమంలో కొన్ని వికెట్లు కోల్పోయాము, అయినప్పటికీ మేము మంచి స్థితిలోనే ఉన్నాము' అని శుభ్‌మన్ గిల్ చెప్పాడు. శ్రీలంకపై భారత విజయంలో కీలక పాత్ర పోషించిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్‌పై శుభ్‌మన్ గిల్ ప్రశంసలు కురిపించాడు. 'మానవ్ సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. భారత్ తరఫున ఆడిన తొలి మ్యాచ్ నుంచే తన ప్రతిభను చూపిస్తున్నాడు. సుతార్‌లో మంచి టాలెంట్ ఉంది. అతడు చాలా కాలం పాటు టీమిండియాకు సేవలందిస్తాడు' అని చెప్పాడు. గాలె టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో మానవ్ ఆరు వికెట్లు పడగొట్టి శ్రీలంక బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ నాలుగు వికెట్లు పడగొట్టిన అతడు.. మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు సాధించి భారత్ విజయంలో కీలకంగా నిలిచాడు.
భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ ప్రదర్శనను కూడా శుభ్‌మన్ గిల్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. 'సెంచరీ చేయడం ముఖ్యమే అయినప్పటికీ.. శతకం తర్వాత కూడా అదే దూకుడును కొనసాగిస్తూ భారీ స్కోరు సాధించడం అతడి ఇన్నింగ్స్‌లో ప్రత్యేకత. ఇలాంటి ప్రదర్శనలే పోటీగా ఉన్న మ్యాచ్‌ను భారత్‌కు అనుకూలంగా మారుస్తాయి' అని తెలిపాడు. తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్ 167 పరుగులతో అద్భుతంగా రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 44 పరుగులు చేసాడు. స్పిన్నర్లపై అతడు ఆధిపత్యం చెలాయించిన తీరు చూడటానికి ఎంతో బాగుందని గిల్ అభిప్రాయపడ్డాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరడమే తమ లక్ష్యమని శుభ్‌మన్ గిల్ చెప్పాడు. టెస్టుల్లో విజయాలు అంత సులభంగా రావని, అందుకే శ్రీలంకపై సాధించిన ఈ విజయం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నాడు. 600వ టెస్టులో విజయం, డబ్ల్యూటీసీ పాయింట్లు, యువ ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో గాలె టెస్టు టీమిండియాకు అన్ని విధాలా ప్రత్యేకంగా నిలిచింది. అందుకే గిల్ చాలా హ్యాపీగా ఉన్నాడు.

## సానియా మీర్జా రెండో పెళ్లి?..

**స్పోర్ట్స్ డెస్క్:**

భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘకాలం టెన్నిస్‌లో అగ్రస్థాయిలో కొనసాగిన ఆమె.. కెరీర్‌లో ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. వ్యక్తిగత జీవితంలోనూ ఆమెకు సంబంధించిన విషయాలు తరచూ వార్తల్లో నిలుస్తుంటాయి. సానియా మీర్జా 2010లో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ మాలిక్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం దుబాయ్‌లో కలిసి జీవించిన ఈ జంట.. అనంతరం 2024లో విడిపోయారు. అప్పటి నుంచి సానియా తన కుమారుడితో కలిసి జీవిస్తూ.. టెన్నిస్ అకాడమీ, ఇతర వృత్తిపరమైన కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్నారు. షోయబ్ మాలిక్‌తో విడిపోయిన తర్వాత సానియా రెండో వివాహంపై గతంలోనూ పలు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా క్రికెటర్ మహ్మద్ షమీతో ఆమెకు సంబంధం ఉందంటూ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తల్లో వాస్తవం లేదని తర్వాత స్పష్టమైంది. తాజాగా సానియా మరోసారి వివాహం చేసుకోబోతున్నారంటూ ప్రచారం మొదలైంది. ఓ విదేశీ వ్యాపారవేత్తతో ఆమె కొంతకాలంగా ప్రేమలో ఉన్నారని, తమ బంధాన్ని వివాహ బంధంగా మార్చుకోవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. కుటుంబ సభ్యులు కూడా ఈ సంబంధానికి అంగీకారం తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే సానియా మీర్జా రెండో వివాహానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. విదేశీ వ్యక్తితో ఆమె ప్రేమలో ఉన్నారనే వార్తలకు కూడా అధికారిక ధ్రువీకరణ లేదు. దీంతో ప్రస్తుతం ఈ ప్రచారాన్ని కేవలం వార్తలుగానే చూడాల్సి ఉంటుంది. ఆమె లేదా కుటుంబ సభ్యుల నుంచి స్పష్టత వచ్చిన తర్వాతే ఈ విషయంపై పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

